సజావుగా ప్రిలిమినరీ

- జిల్లా వ్యాప్తంగా 10 పరీక్షా కేంద్రాలు
- మెదక్ జిల్లాలో 3912 మంది అభ్యర్థులు
- 3125 మంది హాజరు.. 787 మంది గైర్హాజరు

మెదక్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ మెదక్ జిల్లాలో సజావుగా జరిగింది. జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 3912 మంది అభ్యర్థులు రాయాల్సి ఉండగా 3125 మంది హాజరయ్యారు. 787 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడంతో ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. 10 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించలేదు. దీంతో జిల్లాలో 787 మంది అభ్యర్థులు పరీక్ష రాయలేదు. డిపార్ట్‌మెంటల్ అధికారులు, పర్యవేక్షకులు, రూట్ ఆఫీసర్లను నియమించారు.

ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

మెదక్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం తనిఖీ చేశారు. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ తీరును, కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. బయోమెట్రిక్ విధానంతో అభ్యర్థుల హాజరు, పరీక్ష కేంద్రంలోని సీసీటీవీల పనితీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తదితరులు ఉన్నారు.

నర్సాపూర్ బీవీఆర్ఐటీలో

నర్సాపూర్, జూన్ 9: నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ సజావుగా జరిగింది. బీవీఆర్ఐటీ కళాశాలలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ పరీక్షకు 800 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద డీఎస్పీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై పుష్పరాజ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మంబోజిపల్లి పరీక్ష కేంద్రం పరిశీలన

మెదక్‌రూరల్, జూన్ 9: మండలంలోని మంబోజిపల్లి గీతా ఉన్నత పాఠశాలలో గ్రూప్-1 ప్రిలిమినరీ ప్రతాంతంగా ముగిసింది. ఆరుగురు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఐదు నిమిషాలు ఆలస్యంగా రావడంతో అనుమతి లేదని నిరాకరించారు. పరీక్షా కేంద్రాన్ని అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేశ్, రూరల్ సీఐ కేశవులు, కుల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్, రూరల్ ఏఎస్సై శివకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్-1 పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్ బీవీఆర్ఐటీ వద్ద హాల్ టికెట్లను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

సెంటర్ పేరు	అభ్యర్థులు	హాజరు	గైర్హాజరు
బీవీఆర్ఐటీ-ఏ	264	213	51
బీవీఆర్ఐటీ-బి	264	199	65
బీవీఆర్ఐటీ-సీ	288	229	59
ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్	699	565	134
గీతా జూనియర్ కళాశాల మెదక్	384	316	68
సిద్ధార్థ్ మోడల్ హై స్కూల్ మెదక్	480	395	85
గీతా హై స్కూల్-1	240	191	49
గీతా హై స్కూల్ -2	573	450	123
ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల	288	226	62
సిద్ధార్థ్ ఆదర్శ జూనియర్ కళాశాల	432	341	91
మొత్తం	3912	3125	787

నర్సాపూర్ బీవీఆర్ఐటీ వద్ద రూమ్ నెంబర్లను పరిశీలిస్తున్న అభ్యర్థులు

మెదక్‌లోని పరీక్షా కేంద్రంలో అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి అలస్యంగా రావడంతో అనుమతిలేదని చెప్పుతున్న డీఎస్పీ రాజేశ్

నేటి నుంచి ప్రజావాణి ప్రారంభం

- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యల్ని వినిపించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మౌనిక (ఫైల్)

చేగుంట, జూన్9: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందాయిపేట గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చందాయిపేటకు చెందిన ఆవుబోతు నవీన్‌కు కౌడిపల్లి మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మౌనిక(25)తో వివాహం జరిగింది. అంతకు ముందు మౌనిక అక్క శైలజతో నవీన్ వివాహం జరుగగా, అప్పుడు కూడా కుటుంబ కలహాలతో శైలజ గతేడాది జనవరి 19న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. ఆ తరువాత శైలజ చెల్లలు మౌనికను నవీన్ వివాహం చేసుకున్నాడు. మౌనిక, నవీన్ కొన్ని రోజులుగా లింగంపల్లిలోని అత్తగారింటిలో నివసిస్తున్నారు. మూడు రోజులు క్రితం చందాయిపేట కు వచ్చిన మౌనిక ఆదివారం ఇంట్లో ఉరేసుకున్నది. మౌనిక ఆత్మహత్యకు పాల్పడినట్లు లింగంపల్లిలోని తల్లిగారికి తెలవడంతో హుటాహుటిన మృతిరాలి బంధువులు చందాయిపేటకు చేరుకున్నారు. వారం రోజులుగా మంచిగా ఉండి, మూడు రోజుల్లోనే మౌనిక ఆత్యహత్య చేసుకున్నది. మౌనిక మృతికి కారణం నవీన్ కుటుంబ సభ్యులే అని ఆరోపిస్తూ ఆందోళన చేయడంతో నవీన్ కుటుంబ సభ్యులు గ్రామం నుంచి పారిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకొకుండ చర్యలు చేపట్టారు. బాధిత కుటుంబానికి చట్టపరమైన న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతిరాలి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

సాగుకు సమాయత్తం

పత్తి అచ్చును తోలుతున్న రైతు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 9: మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులకు తొలకరి చినుకులు పలకరించడంతో వానకాలం సాగుకు సమాయత్తమవుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పొలంబాట పట్టారు. రోహిణి, మృగశిర కార్తెల్లో విత్తనాలు విత్తితే పంటలు సమృద్ధిగా పండుతాయనే నమ్మకంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. గ్రామాల్లో ఎటూ చూసినా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. నిన్నమొన్నటి వరకు భానుడి భగభగకు ఇబ్బంది పడిన ప్రజలు వరుణదేవుడు కరుణించడంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చాయి. వరుసగా వర్షాలు పడుతుండడంతో పంటలు సాగు చేసుకోవడానికి ఇదే అదునుగా భావించిన రైతులు హుషారుగా వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా మారారు. దీంతో గ్రామాల్లో ఎటూ చూసినా రైతులు జోరుగా వ్యవసాయ పనులు చేస్తున్నారు.

పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-334230
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఏడుపాయల్లో భక్తుల సందడి

ఆలయం ఎదుట భక్తుల సందడి పూజలందుకుంటున్న వనదుర్గామాత

పాపన్నపేట, జూన్ 9: ఏడుపాయల వనదుర్గభవానీ మాతను ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలోని ఆయా పాయల్లో పుణ్యస్నానాలు చేసి దుర్గామాతను దర్శించుకున్నారు. పలువురు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలానీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ చైర్మన్ సతెల్లి బాలగౌడ్, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురిళీధర్, రాజశేఖర్ పూజలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్సై నరేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

కనీస వేతనాలు అమలుచేయాలి: సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

శివ్వంపేట, జూన్ 9: కార్మికులకు కనీస వేతనాల అమలు, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం అన్నారు. ఆదివారం మండలంలోని దొంతి గ్రామంలో శివంపేట, వెల్దుర్తి మండలాల పార్టీ ఏరియా కమిటీల సభ్యులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను యథావిధిగా అమలుచేయాలన్నారు. కార్మికులు సాధించుకున్న హక్కుల్లో కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎ.మహేందర్‌రెడ్డి, కే.మల్లేశ్, శంకర్, కుమార్, లక్ష్మణ్, విఠల్, సాయిలు, వెంకట్, శ్రీను, రాములు, వసంత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేగుంట, జూన్ 9: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి కాలనీలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం అంతంపల్లికి చెందిన పిట్ల కుమార స్వామి (28) చేగుంట మండలం పెద్ద శివునూర్‌లో దశదిన కర్మకు వెళ్లి, తిరిగి తన దిచక్ర వాహనంపై నర్సింహులు, నిర్మలను ఎక్కించుకుని వెళ్తున్నాడు. రెడ్డిపల్లి కాలనీ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కుమారస్వామి అక్కడిక్కడే మృతి చెందాడు. నర్సింహులు, నిర్మలకు గాయాలయ్యాయి. దీంతో తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

ప్రతిఒక్కరికీ ఉద్యోగ విరమణ తప్పదు

ఈవోకు వీడ్కోలు సందర్భంగా శాలువాతో సన్మానిస్తున్న చైర్మన్, మాజీ ఎంపీపీలు

రామాయంపేట, జూన్ 9: ప్రతిఒక్కరికీ ఉద్యోగ విరమణ తప్పదని, చేసిన మంచి పనులు చిరకాలం గుర్తుండిపోతాయని ఈవో మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామాయంపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మహంకాళి దేవస్థాన ఈవోగా మోహన్‌రెడ్డి పనిచేశారు. ఈవో దంపతులకు దేవస్థాన కమిటీ చైర్మన్ సరాఫ్ పాండురంగాచారి, మాజీ ఎంపీపీలు ఏసుగారి రమేశ్‌రెడ్డి, సరాఫ్ మోహనాచారి, ఆలయ కమిటీ డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రవికుమార్, డైరెక్టర్లు రాజు యాదవ్, చింతల రాములు, దోమకొండ యాదగిరి, మర్కు దత్తు, ఆంజనేయులు, నవాత్ రాజేంద్రప్రసాద్, డీబీఆర్ శంకరయ్య, సిబ్బంది మాసుల శ్యామ్‌రాజ్, యాదగిరి, సత్యం, పూజారి నాగరాజుచారి తదితరులున్నారు.

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి మృతి

నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, జూన్ 9: నర్సాపూర్ మున్సిపాలిటీలో హరితహారం విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఉప్పరి లక్ష్మీ ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ దవాఖానలో ఆమె భౌతిక ఖాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సల్ల మురళీ, జవాన్ ఎల్లం, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



పేదల పక్షపాతి తౌర్యనాయక్

చేగుంట, జూన్9: దివంగత తౌర్యనాయక్ సేవలు మరువరానివని నార్సింగి జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు అన్నారు. నార్సింగి మండలం నర్సంపల్లి పెద్ద తండాకు చెందిన తౌర్యనాయక్ గతేడాది వల్లూర్ సమీపంలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం తండలో ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

నిజామాబాద్‌లోని అమృత గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లైన్స్ క్లబ్ ఉత్తమ అవార్డును అందుకుంటున్న చేగుంటలకు చెందిన వెటర్నరీ డాక్టర్ దార లింగమూర్తి, ఆకుల సుఖేందర్ – చేగుంట, జూన్ 9

రెండు రోజుల్లో యూనిఫాంలు అందజేయాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్‌రావు

మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్‌రావు

తూప్రాన్, జూన్ 9: రెండు రోజుల్లో స్కూళ్లకు యూనిఫాంలు చేరేలా చూడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. తూప్రాన్ ఐకేపీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఇరవై ఒక్క పాఠశాలలకు సంబంధించిన స్కూల్ యూనిఫాంలు, ప్యాకింగ్‌లను పరిశీలించారు. యూనిఫాంల తయారీని వేగవంతం చేయాలని, రెండు రోజుల్లో ఆయా పాఠశాలలకు యూనిఫాంలు చేరుకోవాలని సూచించారు. ఆయనతో ఏపీఎం రుక్మిణి, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

రామాయంపేట, జూన్ 9: మండలంలోని అక్కన్నపేట, లక్ష్మాపూర్, ఝాన్సీలింగాపూర్, రాయిలాపూర్, సుతారిపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం బడిబాట కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ టీచర్లు బడిబాటలో పాల్గొని ఇంటింటా ప్రచారం చేశారు.

రాజస్థాన్ సీఎంను కలిసిన మురళీయాదవ్

నర్సాపూర్, జూన్ 9: రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ ఆదివారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనంలో ఆనాటి జ్ఞాపకాలు

నిజాంపేట, జూన్ 9: నిజాంపేటలోని స్థానిక ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏండ్ల తర్వాత ఒకే చోట తమకు విద్యా నేర్పించిన ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందంటూ, తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు సిద్ధిరాంరెడ్డి, మహేశ్, పరశురాములు, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌రెడ్డి, చిరంజీవిగౌడ్, శివకుమార్ ఉన్నారు.

పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

గ్రామ దేవతలకు బండ్లు, బోనాల ప్రదర్శన

రామాయంపేట, జూన్ 9: మండలంలోని ఆర్.వెంకటాపూర్‌లో గ్రామ దేవతలకు ఆదివారం పూజలు చేశారు. దుర్గామాత ఆలయంలో మృగశిర కార్తె సందర్భంగా అభిషేకాలు, మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం బోనాలు ఊరేగించారు. ఇంటికో ఎడ్ల బండిని గ్రామంలోని ఆలయాల చుట్టూరా ప్రదర్శించారు.

ఆర్.వెంకటాపూర్‌లో బోనాలు ఊరేగిస్తున్న గ్రామస్తులు

కొయ్యగుట్ట మల్లన్నకు ప్రత్యేక పూజలు


కొయ్యగుట్టలో కొలువుదీరిన మల్లన్న స్వామి

మెదక్‌రూరల్, జూన్ 9: మండలంలోని మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్టపై కొలువుదీరిన మల్లికార్జున ఆలయంలో ఆదివారం పూజారి మల్లన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

మల్లికార్జున స్వామి సన్నిధిలో భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

చిన్నశంకరంపేట, జూన్ 9: మండలంలోని చందంపేట జడ్పీహెచ్ఎస్‌లో 1999లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 25 ఏండ్ల తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులను ఒక్క చోట కలిపిన తోటి మిత్రులు మధుసూదన్‌గౌడ్, ధన్‌మత్రి యూనిస్, సంతోష్, నర్సింలును అభినందించారు.